"అమ్మా! ఫొటో తీయించుకోవాలి. డబ్బులియ్యవూ?" అన్నాడు విశ్వం.

"అలాగే, బాబూ!" అంది సీతమ్మ.

"ఇలా ఎన్నిసార్లనలేదు నువ్వు!"

సీతమ్మ మాట్లాడలేదు. తీర్చలేని కొడుకు కోరికల్ని తీరుస్తానని చెప్పే ఏ తల్లీ మాట్లాడలేదు!

పరగడుపునే గుప్పెడు బాదంపప్పు తినే ప్రెసిడెంట్ గారి రమేష్‌లా ఉండడు విశ్వం. రోజూ కాంతయ్య కొట్లో చక్కెర కేళీ పళ్ళు కొనుక్కుతినే కామేశంగారి రామేశంలా కూడా ఉండడు. ఇంట్లో డబ్బులు దొంగిలించి దుర్గా విలాస్‌లో పూటపూట పూటుగా మెక్కే పంతులు గారి భాస్కరంలా అసలే ఉండడు!

సీతమ్మ కన్న కొడుకులా ఎలా ఉండాలో అలానే ఉంటాడు విశ్వం!

పావు కిలో మాంసం, అర లీటరు రక్తం కలబోసి పాతిక ఎముక బద్దల మధ్య సర్ది ఒక తోలుతిత్తి దానికి తొడిగితే ఆ ఆకారం విశ్వం తల్లి సీతమ్మలా ఉంటుంది. అక్షరాలా తన రక్తమాంసాలు పంచి ఇచ్చి నలుగురు పిల్లల్ని కన్న పేదింటి మనిషి ఉండే తీరిది అని అనిపించేలా ఉంటుంది. చుట్టచుట్టిన చింకి చాపలా ఉంటుంది.

సత్యం భార్యలా ఎలా ఉండాలో అలానే ఉంటుంది సీతమ్మ.

ప్రెసిడెంటుగారి జీడి మామిడితోట ఫెన్సింగ్ రాడ్‌లా, వారి దూడల పాకలో కర్రాటలా బక్కగా, బిక్కగా ఉంటాడు సత్యం. ఉన్న పొలం అమ్మి పెద్ద కూతురికి, ప్రెసిడెంటుగారి దగ్గర నోటు మీద తీసుకొని రెండవ కూతురికి పెళ్ళి చేసి, ఆ పైన తీరని అప్పుకి, కాబోయే మూడో కూతురి పెళ్ళికి మధ్య నలుగుతూ, ప్రెసిడెంటుగారి దివాణంలో రాత్రింబగళ్ళు నడుం విరుచుకునే కూలి మనిషి ఎలా ఉండాలో అలానే ఉంటాడు!

అటువంటి సత్యం ఇంటికి తెచ్చే దెంత? అందులో సీతమ్మ నాలుగు కడుపులకి సర్దే దెంత?

ఇంక పిల్లవాడి కోరిక ఎలా తీరుస్తుంది? ఫొటో ఎప్పటికి తీయిస్తుంది!

అయితే, గుడ్డిలో మెల్లలా విశ్వానికి తన ఇంటి పరిస్థితి తెలుసు. అడగ కూడనివి తెలుసు. అడిగే వెప్పు డడగాలో తెలుసు.

పెద్దక్క పెళ్ళప్పుడు విశ్వం అయిదో తరగతి చదివేవాడు. అంతవరకు అడగకుండానే పుస్తకాలన్నీ కొని ఇచ్చేవాడు తండ్రి. బట్టలూ నాలుగు జత లుండేవి!

చిన్నక్క పెళ్ళినాటికి ఎనిమిదిలోకి వచ్చాడు. ఆ రోజుల్లో అడిగినప్పుడు మాత్రమే ముఖ్యమైన పుస్తకాలు కొనగలిగేవాడు తండ్రి. రెండు జతలు అమరటమే గగనమై పోయింది.

పదిలోకి వచ్చేసరికి అడిగినా పుస్తకాలు కొని ఇవ్వలేని స్థితికి దిగజారి పోయాడు తండ్రి. నాటి చిరుగుల జతలే నేటికి మిగిలాయి.

అయితే, బడిలో విశ్వం కథ మరో విధంగా ఉంది.

కూలివాడి కొడుకు మరో కూలివాడు కావాలి. ఇది ఈ లోకంలో రివాజు. ఆ సంప్రదాయం దుంప తెంచేశాడు విశ్వం.

ఏదో ఉత్తరం ముక్కయినా వ్రాసుకోవటానికి పనికివస్తాడని సత్యం మాట పెడచెవిని పెట్టి బడిలోకి పంపింది సీతమ్మ. కాని, తరతరాలుగా ఆ ఇంటా వంటా లేని తంటా తెచ్చిపెట్టాడు. అందరూ సత్యాన్ని, సీతమ్మని ఆడిపోసుకునేవారే.

విశ్వం చేసిన ఆ ఘోరమైన పాపం— పెద్దఇంటి పిల్లలకి కడుపు మంటగా, పెద్దలోగిలి వారికి కన్నెర్రగా చూపులకి ఏకులాంటి కుర్రాడు చదువులో మేకై కూర్చోవటం!

ఏడులో స్కూలు ఫస్టు. ఎనిమిదిలో స్కూలు ఫస్టు. తొమ్మిదిలో స్కూలు ఫస్టు. ఒక్కటే కాదు, మూడు తరగతుల్లో వరసగా స్కూలు ఫస్టు రావటం మరి ప్రెసిడెంటుగారి తోటలో కాకతాళీయంలా కాదు. కామేశంగారి శ్రీమతికి లాటరీ తగలటం లాంటిదికాదు. పంతులుగారి దొడ్లో ఎడంచేత్తో కొమ్మ వంచి కుడిచేత్తో జామిపండు కోసుకున్నంత సులువు కాదు.

చిటారు కొమ్మ నున్న అల్లనేరేడు పండు నేల జారి ఇసుక పాలు కాకుండా ఒడుపుగా చేతిలోకి కోసి తెచ్చుకోవటం వంటిది! నిలువులోతు నది ఏట్లోకి ఈది వెళ్ళి తామరతూడులు తెంపుకురావడం వంటిది! మంచు తుఫానులో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి అక్కడ విజయ పతాకం ఎగరవేయటం వంటిది!

జ్ఞాపకశక్తి, పఠనాసక్తి, సాధన సంపత్తి — వాటి సమ్మేళనమే విశ్వం! అర్థంలేని ప్రశ్నలంటూ చిదరించిన అలనాటి టీచర్లకీ వాడు అత డడిగే ప్రశ్నలకి జవాబులు చెప్పటంకోసం పాత పుస్తకాలు తిరగవేయుటం నిజంగా ఒక మెచ్చుకోదగిన శిక్ష!

క్రితం ఏడు స్కూల్లో మాగజైన్ అచ్చొత్తించారు. అటువంటి 'బ్రిలియంట్ స్టూడెంట్' ఫొటో అందులో ముద్రించాలని హెడ్మాస్టరు నిర్ణయించటంలో వింత లేదు.

"తీయిస్తాను. . . తీయిస్తాను" అంటూ తీయించనే లేకపోయింది సీతమ్మ. తీరా రెండు రూకలు జాగ్రత్త చేసి పిల్లాడికి ఇద్దామనుకునే రోజున పెద్ద కూతురికి ఒంట్లో బాగా లేదని కబురు. చూసిరాక తప్పలేదు. మరోసారి చిన్న




కళ్లజోడు లేకుండ మీరు కంటి చూపు పొందగలరు!

మీకు ఇంతకన్న ఎక్కువ ఆనందాన్నిచ్చేవార్త మరొకటి ఉంటుందా!



'కాంటాక్ట్ లెన్స్'లను వాడండి

ఈ 'కాంటాక్ట్ లెన్స్' లు హ్రస్వదృష్టి, దూరదృష్టి మరియు అఫాకి (కాటరాక్టు ఆపరేషను పిమ్మట), కెరాటోకోనస్, అనిసోమెట్రోపియా, అనిసికోనియా, పాలియోపియా మొదలైన దృష్టిదోషములు కలవారికి ఉత్తమమైనవి.

'కాంటాక్ట్ లెన్స్'లను మీ కంటి పాపలకు మీకుమీరే అనుసులభంగా పెట్టుకొనవచ్చును... తీసివేసికొనవచ్చును - కొద్దిదినముల అభ్యాసంతో. మీ కళ్లకు పెట్టుకొన్న చిన్న 'కాంటాక్ట్ లెన్స్' లు ఇతరులకు అగుపించవు. కనుక మీ సుందర ముఖంలో ఎట్టిమార్పును వుండదు.

మీ కంటి వైద్యుని సంప్రదించండి

ఇతర వివరములకు: ఆసియా కాంటాక్ట్ లెన్స్ లేబొరేటరీ

ఫోన్స్: 662600 82722 82595

ల్యాబొరేటరీ: 13, కిల్‌గ్రిస్ అవెన్యూ, హేరింగ్‌టన్ రోడ్, మదరాసు-31.

కార్యాలయము: 5-G, వీరభద్ర అయ్యర్ స్ట్రీట్, నుంగంబాకమ్, మదరాసు-34.

# నీ ఫోటో అచ్చయింది, తమ్ముడూ!



పాతురు చుట్టం చూపిచ్చింది. రవికల గుడ్డ పెట్టాలొచ్చింది.

ఫోటో పట్టుకు వెళ్ళలేకపోయిన విశ్వం మాస్టారికి కనిపించకుండా చాలా రోజులు ముఖంచాటు చేసుకుంటూ వచ్చాడు. చివరికి అతని ఫోటో లేకుండానే మాగజైన్ అచ్చయిపోయింది.

"స్పైవలియర్ అయిపోయింది కూడాను. ఈ మాటయినా నీ ఫోటో తీసుకురారా, విశ్వం!" అన్నారు హెడ్మాస్టారు.

తప్పకుండా తెస్తానన్నాడు విశ్వం. తనకూ నిజంగా పట్టుకు వెళ్ళాలనే ఉంది. తన కిమ్మన్న గౌరవం నిలబెట్టుకోవాలనే ఉంది.

మధ్యాహ్నం భోజనాలవేళ గ్రౌండులో చెట్టునీడ చదువుకుంటూ కూర్చునే విశ్వాన్ని చూడని వాళ్ళు లేరు. అతడికి మూడో పూట ఇంటికి వెడితే అక్కడేమీ తినటానికి ఉండదన్న సంగతి వాళ్ళలో తెలియనివాళ్ళు లేరు. అప్పుడంలా అతుక్కు పోయిన వాడి డొక్క చిరుగులచొక్కా లోంచి తొంగి చూస్తూ అతడి పాత కథ ఏ నాటి కానాడు కొత్త కొత్తగా చెపుతూనే ఉంది.

కళ్ళెదుట రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక మనిషి చావు బ్రతుకుల మధ్య వేలాడుతున్నాడు. వాడికి మరు క్షణంలో ఏమైపోతుందో అని ఆందోళన పడతారు; జాలి పడతారు. దైవాన్ని ప్రార్థిస్తారు. కనపడిన వాడికల్లా చెప్పి బోలెడంత ఇదయిపోతారు. కాని, చటుక్కున ముందుకు వెళ్ళి ఒక చెయ్యి ఆసరా ఇవ్వాలని అనుకోరు. ఎందుకని? భయం— ఎక్కడ బాధ్యత మీద పడుతుందో అని భయం. నలుగురూ తలో చెయ్యీ వెయ్యరు సరికదా, తనకే అంతా అప్పగించి పోతారని భయం. ఈ భయాలతో సాంఘిక ధర్మాన్ని, దాన్ని మించిన మానవధర్మాన్ని గాలికి వదిలి పెట్టేస్తారు. ఎలా జరగ దలుచుకుంటే అలాగే జరుగుతుంది— మనం ఒట్టి నిమిత్తమాత్రులం అని గాఢంగా నిట్టూర్చి ఎవరి మట్టుకు వారు వెనకడుగు వేసే ముసుగు మనుషులే చాలామంది ఉంటారు.

అటువంటి వారే విశ్వం టీచర్లూను. అతని ఫోటో మాగజైన్‌లో అచ్చు వేయించాలన్నది వారికి ముచ్చట. కాని, అది అతని కెలా వస్తుందన్న సంగతి వారికి పట్టదు. పేద బ్రాహ్మణుడికి మహారాజావారు ఏనుగును దానం చేయించటం వంటిదని వాళ్ళకి తోచదు.

అడకత్తెరలో పోకలా, పులి మేక ఆటలో ఒంటిమేకలా నలిగిపోతున్నాడు విశ్వం. మాగజైన్‌లో తన ఫోటో చూసుకోవాలన్న కోరిక కన్న మాస్టారికి తానిచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న ఆరాటం వాడి

-విమలా రామం

కెక్కువైంది. సంపాదించటం కన్న అందుకున్న గౌరవం నిలబెట్టుకోవటం ఎంతో కష్టం. ఆ కష్టంలో ఉన్నాడు విశ్వం.

డ్రైవింగ్ సరిగా రాకపోయినా, లైసెన్సు లేకపోయినా తండ్రి చేత స్కూటరు కొనిపించటం రమేష్‌కి చిటికెల మీద పని. లేటెస్టు టెరిలీన్ మోడల్స్‌లో టిప్‌టాప్‌గా ఉండటం రామేశానికి అవలీల. ప్రతి ఫస్టు రిలీజు సినిమాని టౌన్‌కి వెళ్ళి మొదటి రోజున మొదటి ఆటకి చూడటం భాస్కరానికి వెన్నతో పెట్టిన విద్య.

అయితే, ఒక్కగానొక్క ఫోటో తీయించుకోవటం విశ్వానికో గగన కుసుమం!

"ఇప్పుడు నీ ఫోటోకి తొందరే

మెచ్చిందిరా, విస్సూ! అమ్మని మాటి మాటికి అలా వేపించుకు తింటా వెందుకు?" అంది గౌరి.

చదువుకోని అక్కకి స్కూలు ఫస్టు రావటంలోని 'థ్రిల్' ఎలా అర్థమవుతుంది? తన మీద తానెప్పుడూ జాలి పడటం ఎరగని విశ్వం అక్కమీద జాలి పడ్డాడు.

"నేను ఫోటో అడిగింది నే నెలా ఉంటానో చూసుకోవాలని కాదక్కా! నా ముఖం అమ్మ కళ్ళలో రోజూ చూసుకుంటూనే ఉన్నాను."

"మరెందుకురా?"

చెప్పాడు. అక్క కర్థం అయ్యే మాటల్లో చెప్పాడు. అమ్మకు వినిపించాలని మాత్రం చెప్పలేదు.

"స్కూల్లో ఫస్టు వచ్చిన అబ్బాయి ఫోటో స్కూలు పత్రికలో అచ్చు వేస్తారు. రాష్ట్రం మొత్తంమీద ఫస్టు వస్తే పేపర్లో అచ్చు వేస్తారు."

గౌరి కళ్ళు చెరువు కట్టమీద గుళ్ళో కూర్చున్న అంకాలమ్మ కళ్ళం తయ్యాయి. "అయితే, నీ ఫోటో పేపర్లో ఎప్పుడచ్చవుతుందిరా, తమ్ముడూ?"

విశ్వం ముంచుకొచ్చిన సిగ్గుతో ముడుచుకుపోయాడు: "అబ్బో, నే నంత గొప్పగా ఎక్కడ చదివాను?" అని మళ్ళీ వెంటనే అందుకున్నాడు. "ఎప్పటికైనా నా ఫోటో పేపర్లో అచ్చవ్వాలి. అంతవరకు నేను నిద్రపోను. క్రితం ఏడు మన పక్క ఊరు అబ్బాయి ఐ. ఏ. ఎస్. లో ఫస్టు వచ్చినట్లు పేపర్లో పడింది. చూపించాను— గుర్తుందా?"

"అవును. అయ్యేయెస్ అంటే ఏమిటిరా? జీతం ఎంతుంటుంది? రెండొందలుంటుందా?"

విశ్వం నవ్వకుండా ఉండలేకపోయాడు. "పిచ్చక్కా! ఐ. ఏ. ఎస్. అంటే కాబోయే నీ మొగుడిలా కూరలకొట్టు పెట్టుకోవట మనుకున్నావా!"

ఎన్నో రోజులుగా కనిపించని రక్తవర్ణం ఆమె చప్పి దవడం మీద తొంగి చూసింది.

"పోరా! నువ్వెప్పుడూ ఇంతే."

"ఆ పరీక్ష పాసయితే కలెక్టరవుతాను. జిల్లాకంతా అధికారి నవుతాను తెలుసా, అక్కా!" విశ్వం కళ్ళు కటిక చీకటిలో మిణుగురుల్లా మెరుస్తున్నాయి.

"ఒరే, కలట్టరు తమ్ముడూ! నువ్వంత వాడివయితే నీకీ పిచ్చక్క గుర్తుంటుందిరా?"

శారీరికంగా మొగ్గైన విశ్వం అంతరంగం విచ్చుకునే ఉంది. దొడ్లో మొక్కల మీద కురుస్తున్న వెన్నెల వానలో తడుస్తూ ఆ వెలుగుని కళ్ళతో గుండెల కెత్తుకుంటూ అన్నాడు: "ఈ వెన్నెల చూడక్కా! మన గుడిసె మీద, పంతులుగారి పెంకుటింటిమీద, ప్రెసిడెంటుగారి మేడమీద సమంగా కురుస్తోంది. అదిగో, మనుషులెప్పుడూ అలాగే మసలుకోవాలక్కా!" అని తల దించుకుంటూ తనలోకి చూసుకుంటూ తనతో తను అనుకుంటున్నట్లుగా అన్నాడు: "తల దాచుకోవటానికి మన కీ పాకయినా ఉంది. ప్రతి రోజూ ఏదో ఒక పూటయినా కడుపు చల్లబడుతూంది. ఈమాత్రం కూడా లేనివాళ్ళు బిజ్జా వంటి వాళ్ళెంత మందున్నారో ఈ లోకంలో! వీళ్ళందరికీ చేతనయినంత సాయం చేయాలి."

గౌరి మాట్లాడలేదు. ఆ అమ్మాయికి తమ్ముడి మాటలు అర్థం కాలేదు.

సీతమ్మ మాట్లాడలేదు. ఆమెకు నోరు విప్పితే మాట కన్న ముందు దుఃఖం బయటకు వచ్చేలా ఉంది.

మళ్ళీ గుర్తుకు తెచ్చింది గౌరి. "మరి ఇప్పుడు ఫోటో ఎలా?"

పొదుగు చేపని ఆవు వైపు కడుపు కాలుతున్న దూడలా చూశాడు విశ్వం. వట్టిపోయిన గోవులా ఉంది సీతమ్మ. విశ్వం మెదడు మొద్దుబారిపోయింది. మళ్ళీ అడగాలనిపించలేదు. మరోసారి తల్లి మనస్సు తూట్లు పొడవాలనిపించలేదు.

గౌరి తమ్ముణ్ణి దూరంగా తీసుకుపోయింది. "పరీక్ష లయిపోయాకకూడా పుస్తకా లట్టుక్కూర్చుంటా వెందుకురా, విస్సూ! రెండ్రోజుల పాటు . . ."

"చెప్పక్కా! నే నేమనుకోను."

"ఏ తోటకయినా పనిలోకి వెడితే..."

"అరే, నా దెంత మట్టిబుర్ర! నా కీ బుద్ధి ముందే ఎందుకు పుట్టలేదు? అయితే, నన్ను చూసి ఎవరయినా నాకు పనిస్తారంటావా?"

"పొలిమేరల కాడికి పోతేసరి. నువ్వు చేసే పనికి సగం కూలయినా ఇవ్వక పోరు."

"బలే ఐడియా చెప్పావు. చాలా థాంక్సక్కా!"

"అంటే?"

విశ్వం నిండుగా దోసపండులా

పతాక వందనం చిత్రం— వి. సత్యనారాయణరావు ( తెనాలి )



వచ్చాడు. "అదంతేలే. అమ్మకి సంగతి చెప్పకేం? బాధ పడుతుంది."

* * *

ఆ మరునాడు రాత్రి ఇంటికి పొద్దు పోయి వచ్చాడు విశ్వం. తల్లీ కొడుకు లిద్దరూ ఒకరిని చూసి ఇంకొకరు భయ పడ్డారు. చటుక్కున దృష్టి మళ్ళించు కొని తలో వైపూ వెళ్ళిపోయారు.

'అక్క అన్నం పెట్టింది. తమ్ముడు తింటున్నాడు.

'పొద్దంతా ఎక్కడున్నా'వని అమ్మ అడగనందుకు దేవుడికి మొక్కుకున్నాడు విశ్వం.

మళ్ళీ ఫోటో సంగతి కొడుకు ఎత్త నందుకు దేవతకి దండం పెట్టింది సీతమ్మ.

దేవతలు, దేవుళ్ళు ఈ మట్టిబొమ్మ లతో ఆడుకుంటున్నారు!

"అబ్బా!" అని మూలిగాడు విశ్వం. తమ్ముడి చెయ్యెందుకు చూసింది గౌరి. అరచెయ్యంతా పుళ్ళు పడి ఉంది. విశ్వం ఓ నవ్వు నవ్వి అక్క బాధ తగ్గించబోయాడు,

"బాపన్నగారి తోటలో వంగమళ్ళు . . . అలవాటు లేని పని కదూ? అందుకు . . . రేపు మరో చోటికి పోతాను కాని . . . అమ్మకి చెప్పకేం? ఇదిగో, ఇది జాగ్రత్తగా దాచు" అంటూ అక్క చేతుల్లో ఒక రూపాయి కూరాడు. గౌరి ఉక్కిరి బిక్కిరయింది.

"ఆ చొక్కాకూడా చిరిగింది. కొంచెం కుట్టి పెట్టక్కా! ఆ గెలా ఉన్నా ఫోటో తీయించుకునేటప్పుడు చొక్కా అలా ఉంటే బాగుండదు." తమ్ముడప్పుడే ఫోటో దిగినంత మురిసిపోయింది ఆ పిచ్చక్క!

* * *

ఆ వేళ ప్రొద్దున్నే ప్రెసిడెంటుగారి పిడపోతుని అంకాలమ్మకి బలి ఇచ్చారు.

'ఏళకాని ఏళ ఏంటి కత?'

'అమ్మగోరికి ఆ మద్దెన ఒళ్ళు బాలేదంట. అమ్మోరుకి మొక్కుకున్నారు . . . ఆ దీయేల సెల్లిపోయింది.'

దివాణంలో పాలేర్లకి, పనివాళ్ళకి ప్రసాదం పంచిపెట్టారు, అందరికీ రుచి చూపిద్దామని ఇంటికి తెచ్చాడు సత్యం.

బిడ్డ కోసం కళ్ళలో వత్తులు వేసు కొని ఎదురు చూస్తూంది తల్లి. ఈ పూట ఎందుకో ఆమెకు అనుక్షణం గుర్తుకు వస్తున్నాడు విశ్వం. వాడుక ఇళ్ళలో పనిచేసి వచ్చిందే కాని, మనస్సంతా ఇంట్లోనే ఉంది. రెండు రోజులుగా వాడు ఇంట్లో సరిగా కనిపించటం లేదని ఇప్పుడిప్పుడే గుర్తుకు వస్తూంది. 'మళ్ళీ ఫోటోమాటే ఎత్తాడు కాదు. నొచ్చు కున్నాడేమో పిచ్చికూన' అని గుడుసుళ్ళు పడిపోతూంది.

"తమ్ముడేమయ్యాడే?" పది నిమిషాల కోసారి అడుగుతూంది సీతమ్మ.

"ఏ మ్యాటగా రింటికో పోయుం టాడు. వస్తాడులే." చెప్పిన జవాబే చెపుతూంది గౌరి.

ఉట్టిమీద ప్రసాదం పెట్టిన చోటే ఉంది. ఎన్నాళ్ళకో చచ్చిన జిహ్వ లేచి వచ్చింది. అయినా, తను తినలేదు. పిల్లాడి కది తినిపించాలి. కళ్ళు కాయలు కాయించు కుంటూంది సీతమ్మ.

ఈ పూటతో మూడు రూపాయలు చేతి కందుతాయి. తమ్ముడికి ఫోటో వస్తుంది. అద్దంలో చూసుకోవచ్చు. ఆకాశానికి నిచ్చెనలు వేస్తూంది గౌరి.

అదే సమయంలో కామేశంగారి అరటితోటలో బోదెలు తవ్వుతున్నాడు విశ్వం.

వీరయ్య, భీమన్న ఆ తోటలో పనికి ఒప్పుకున్నారు. హఠాత్తుగా ఆ పూట పని ఎగ్గొట్టాడు భీమన్న. తానొక్కడూ తోటకంతకీ నీరెట్టటం జరగని పని. కామేశంగారు చూస్తే భీమన్న కూలి తన కివ్వడు సరికదా చీవాట్లు తినిపిస్తాడు.

దిగాలుగా పొలం వైపు పోతున్న వీరయ్యను దారిలో పలకరించాడు విశ్వం. తన అవసరం చెప్పుకున్నాడు. రూపాయి కూలి ఇప్పిస్తే చాలన్నాడు. ఏ పని చెప్పినా చేస్తానన్నాడు. ఇలా పని చేసినట్లు మాత్రం ఎవరికీ చెప్పవద్దన్నాడు.

వీరయ్య పంట పండింది. భీమన్న పనితోబాటు తన పనిలోకూడా విశ్వానికి వాటా పంచి ఇచ్చాడు. వాడి కూలితో సగానికి పైగా వాటా పంచి పుచ్చు కున్నాడు. ఈ సంగతి తను ఎవడికీ చెప్పడు సరికదా, వీరయ్యనే ఎవరికీ చెప్పద్దన్నాడు విశ్వం. ఒక్క దెబ్బకి మూడు పిట్టలు! ఇది వీరయ్య ఆలోచన.

ఈ ఒక్క రోజు కష్టపడితే ఫోటోకి కావలసిన డబ్బులు వస్తాయి. మాస్టారి కిచ్చిన మాట చెల్లించి తన గౌరవం నిలబెట్టుకోవచ్చు. ఆ పైన మాగజైన్‌లో తన ఫోటో చూసి అక్క ఎంత సంబరపడి పోతుంది! అమ్మ, నాన్న ఎంత మురిసి పోతారు! ఇది విశ్వం ఆలోచన.

శక్తికి మించిన సాధన! వీరయ్య ఊహ కందని తపస్సు! నరనరాలలోని శక్తిని ఒడ్డి పోస్తున్నాడు విశ్వం!

ఆ అర్భకుని శరీరానికి స్మృతి లేదు. ఉన్న రక్తం స్వేదంగా పెల్లుబుకు తూంది. ధారలు కట్టి బోదెలలో కురు స్తూంది. బోదెలు నిండుతున్నాయి!

వీరయ్య చుట్ట కాల్చుకుంటూ 'ఏక్ దిన్‌కా సుల్తాన్' లా కులాసా కబుర్లు చెప్పుతున్నాడు. సిగ్గు వదిలెయ్యటంలో



జంట

చిత్రం—ఎమ్. రామ్మూర్తి
(కరీంనగర్)

చాలా సుఖం ఉంది! వీరయ్య అనుభవశాలి. విశ్వానికి పని అంతా అప్పగించేసినందుకు అతని మనస్సు ఒక్కసారికూడా చివుక్కు మనలేదు. ఏం చేస్తాడు? పాపం, గంట నుంచి అతని మనస్సు రంగి మీదుంది!

పక్క తోటలో పని చేసుకుంటూంది రంగి. "ఇప్పుడే వస్తాను, బుల్లోడా! పని చేస్తూ ఉండు" అని వెళ్ళిపోయాడు వీరయ్య.

ఒంటరిగా ఓర్పుగా పని చేసుకుంటు న్నాడు విశ్వం. ఇంకాస్సేపట్లో పని అయిపోతుంది. ఇక వీరయ్య వచ్చేస్తాడు. రూపాయి ఇచ్చేస్తాడు. ఇక మాగజైన్‌లో తన ఫోటో. . . అక్క చూసి. . .

విశ్వం ఊహాగానంలో అపశ్రుతుల్లా దక్షిణం వైపు కొబ్బరి తోటలోంచి ఎవరివో చావుకేకలు వినిపించాయి.

కంగారుగా అటు పరుగెత్తాడు. అరటి తోటలోంచి బయటకు వచ్చాడో లేదో ప్రెసిడెంటుగారి రమేష్ కొబ్బరితోట కడ్డంగా దూసుకుపోతూ కనిపించాడు. తోట మధ్యలో ఎవడో నేలమీద పడి వికృతంగా అరుస్తున్నాడు. అదంతా ఏమిటో అర్థం కాలేదు విశ్వానికి. పేరు పెట్టి పిలిచే లోపల రమేష్ కనుమరుగై పోయాడు. మరో నిమిషానికి దూరంగా స్కూటరు శబ్దం చేసుకుంటూ వెళ్ళిపోయింది.

కొబ్బరితోటలోకి పరుగెత్తాడు విశ్వం. రక్తం మడుగులో గిలగిల కొట్టుకుంటు న్నాడు గవరయ్య! కన్ను చెదిరిపోయింది. గుండె పిండి పిండి అయిపోయింది. రక్తం గడ్డ కట్టి పోయింది. భయంతో అడుగు కదల్చలేక ఈదురుగాలిలో వెదురు బద్దలా అక్కడే నిలబడిపోయాడు విశ్వం!

"ఏంటిరా ఇదీ!" అని ఎవరో అరిచే సరికి ఉలిక్కిపడ్డాడు విశ్వం.

కామేశంగారి కమతగాడు పగుర్చు కుంటున్నాడు. స్పృహలోకి వచ్చిన విశ్వం చుట్టూ కలయ జూశాడు. నలుమూలల నుంచీ జనం పరుగెత్తుకు వస్తున్నారు. కామేశంగారు అల్లంత దూరాన కనిపించే సరికి విశ్వం పై ప్రాణాలు పైనే పోయాయి!

'రోజంతా పడిన శ్రమ వృథా అయింది. ఇంక వీరయ్య తనకి రూపాయి ఇచ్చేది లేదు.' మీద పడి కబళించ బోతున్న పెనుభూతాన్ని పొత్తిగా ఊహించలేని ఆ పసివాడు కాలిలో గుచ్చుకున్న ముల్లు ఎలా తీసుకోవాలో ఆలోచిస్తున్నట్లు నిలబడిపోయాడు.

కామేశంగారి కమతగాడు అరుస్తు న్నాడు. "సచ్చిపోయాడ్రోయ్! గౌరయ్య సచ్చిపోయాడు. కుర్రనాయాల. . . సంపేశాడు."

బిక్కు బిక్కుమంటూ కారడవిలో దారి తప్పిన కుందేలు పిల్లలా దిక్కులు చూస్తున్నాడు విశ్వం. వేటకుక్కల్లా చొచ్చుకు వచ్చారు పక్క తోటల్లో పని చేసుకుంటున్న పెద్దమనుషులంతా. వారిలో వీరయ్యా ఉన్నాడు. సంగనావి రంగీ ఉంది.

"ఏంటి జర్గింది. ఏంటి జర్గింది..." అంటూ రేక్కాయలు రాల్చినంత అవలీలగా ప్రశ్నలవర్షం కురిసిస్తున్నారు. జవాబు చెప్పగల వాళ్ళీ లోకంలో ఇద్దరే ఉన్నారు. ఒకడు—పై నుంచి అన్నీ చూస్తూ పలకని దేవుడు; రెండవ వాడు—వినిపించినంత దూరంగా చావు బ్రతుకుల మధ్య వ్రేలాడు తున్న గవరయ్య.

అందుకని తమకు తామే జవాబులు చెప్పేసుకున్నారు ఆ జనం.

"ఈ కుర్రోడు గౌరయ్య తల పగలగొట్టి సంపేశాడు, బాబూ!" కళ్ళతో చూసినట్లు కమతగాడు కామేశంగారికి విన్నవించుకున్నాడు.

అంతవరకు మొద్దుబారిపోయిన విశ్వం పెదవుల్లో ఆటంబాంబు పేలింది. "నేను చంపలేదు, బాబూ! నేను చంప లేదు. నా కేం తెలియదు, బాబూ! నా కేం తెలియదు!"

విశ్వానికి ఏడవాలని లేదు. బలిపశువు లేపీ ఏడవాలని అనుకోవు. కాని, గుంట కాడ కాపు కాసిన నక్కలకి మెడ తెగే ముందు మేకను చూడాలంటే చక్కనైన మక్కువ!

"మరయితే ఎవడు కొట్టాడ్రా!" కామేశంగారు అరిచారు.

రమేష్ పేరు చెప్పబోయి తటపటా యించాడు విశ్వం. తను కొట్టటం చూడలేదు. అతను పారిపోవటం ఒకటే చూశాడు. పరన్యాయ నిర్ణయంలో తన 'పాయింటు' కాస్త పోగొట్టుకున్నాడు.

"నాకు తెలియదండి. నేను గవరయ్య కేకలు విని అరటితోట లోంచి పరుగెత్తి వచ్చాను, బాబూ! వచ్చి చూసేసరికి. . ."

"ఒరి దొంగవెధవా! బళ్ళో చదువు కుంటూంది కట్టుకథలు చెప్పడానికిరా! అసలు నువ్వు మా అరటితోటలో కెందు కెళ్ళావు?" అంటూ విశ్వం చొక్కా దొరకపుచ్చుకున్నారు కామేశంగారు. ఆయన ఉడుంపట్టుకి వాడి చీకిన చొక్కా మరింత చిరిగింది. చటుక్కున చెయ్యి వెనక్కి లాగి ఆ విసురులోనే విశ్వం చెంప వాయగొట్టాడు.

కామేశంగారి కోర్టులో ముందు శిక్ష, తరవాత ఆరోపణ, ఆపైన విచారణ ప్రారంభమవుతాయి! కారణం? నేటి ప్రెసిడెంటుగారు తనని మూడేళ్ళుగా పంచాయితీ ఎలక్షనులలో గెలవనివ్వని బద్ధశత్రువు. వారి ఇంటిలో కుక్క కన్న విశ్వాసంగా బ్రతికే మనిషి సత్యం. వాడి కొడుక్కి తన తోటలో ఏం పని? అదీ శ్రీవారి 'రీజనింగు!'

బలవంతుని స్వయంనిర్ణయం ముందు బలహీనుని న్యాయనిర్ణయం చెల్లు.

అవకాశం వచ్చింది. ప్రెసిడెంటు అంతు చూడాలి. కామేశంగారు చూసేస్తున్నారు.

ఆశల కోటలన్నీ ఇసుకలో పిచిక గూళ్ళయి కూలిపోగా వెలతెలబోతూ వణికి పోతున్నాడు విశ్వం. పెద్దల పగలు, వారి ఆశ్రితుల పగటి వేషాలు బొత్తిగా తెలియని కుర్రకుంకకి ఎక్కడ పని చేయకూడదో, ఎందుకు చేయకూడదో ఎలా తెలుస్తుంది? తెలియనందుకుకాదు, తెలుసుకోనందుకు శిక్ష అనుభవించాల్సిందే మరి!

"ఈ పూట మా తోటలో పని చేయటాని కొచ్చాను, బాబూ!"

కామేశంగారు వీరయ్య వైపు ఉరిమి చూశాడు. "ఏమిరా, నిజమేనా?"

చేతికందిన పిట్ట లిట్టే ప్రాణాలు వచ్చి ఎగిరిపోయిన వేటగాడులా ముఖం పెట్టాడు వీరయ్య.

"లేదు, బాబూ! నే నీకుర్రాణ్ణింత



**రూపరేఖలు**

ఎస్. ప్రేమకుమార్ (హైదరాబాదు)

వరకు ఈ యేళ సూణ్ణేలేదు. తోటలో బోదెలకి నీళ్ళడుతున్నా. ఏదో సావు కేక ఇనిపించి ఈడ కురుక్కొచ్చినా ..."

"అబద్ధం చెప్పకు, వీరయ్యా! నీ కిది న్యాయం కాదు ..." విశ్వం నోటికి మూత పడేలా మరోసారి చెంప ఛెళ్ళు మంది. పాపం, కామేశంగారి చెయ్యి నెప్పి పెట్టింది. ఈ మాటు చెప్పు చేతి కందుకున్నాడు.

ఇష్టులు నసిగితే తప్పుకాదు. చెప్పు దెబ్బలు తినటానికి పెట్టి పుట్టినవాళ్ళు నిజం చెప్పమనటం కూడా ఒక పెద్ద తప్పు!

తత్ఫలితంగా విశ్వం నోట్లోంచి చెంచాడు రక్తం. ఆయన పాదాల మీదికి చిలికింది. ఇంకా వారి గుండెల మంట చల్లారలేదు.

రంగికి నిజమేదో తెలుసు. తను నోరు విప్పితే త నా తోటలో ఎందుకుందో ఆరా వస్తుంది. వీరయ్యతో రంకు వీధిని పడుతుంది. కులంలో తప్పు, మగనితో ముప్పు. పాపం, ఇక రంగి నోరెలా తెరుస్తుంది!

నోరు విప్పవలసిన వారు విప్పరు; విప్పలేరు. నోరు విప్పి నిజం చెపుదా మనుకుంటున్న విశ్వం నోరు వాయకొడుతున్నారు కామేశంగారు.

చావుదెబ్బలు తిన్న వాణ్ణి హాస్పిటలుకు తీసుకువెళ్ళటం కన్న చేతి కందిన మనిషి మీద నేరం మోపి శిక్ష అమలుజరపటం ముఖ్యం. కామేశంగారి కచేరీలో ఆ న్యాయం వర్ధిల్లింది!

* * *

"పొగరుమోతు వెధవ! ఒక్క బొండం కొట్టివ్వరా అంటే — నీలిగాడు. నాన్న గార్ని, నన్ను నానా కూతలు కూశాడు. ఒక్క దెబ్బతో బుర్ర రామకీర్తన పాడించాను. ఈపాటికి చచ్చి ఉంటాడు వెధవ." రమేష్ తను చేసిన ఘనకార్యం జంకు, గొంకు లేకుండా అక్కగారికి వివరంగా చెబుతున్నాడు.

"ఎవరి దా తోట?"

"వాడిదే ... ఆ కామేశం గాడిది."

బయటి గుమ్మంలోంచి వాళ్ళ సంభాషణ విన్న ప్రెసిడెంటు గారి శ్రీమతి ఒక్క పరుగులో మేడమెట్లు దిగింది. వాకిట్లో ఎవరితోనో మాట్లాడుతున్న శ్రీవారిని అంత:పురంలోకి పిలిచింది. ఇద్దరి మధ్య పావుగంట సేపు సంప్రతింపు లయ్యాయి.

రక్తపు మడుగులో తడిసిన గవరయ్య శరీరాన్ని ఊళ్ళోకి తీసుకువస్తున్న ఎడ్ల బండి కెదురుగా ప్రెసిడెంటుగారి కారు పట్నం వైపుగా దూసుకుపోయింది. అందులో వారి పుత్ర రత్నం రమేష్ సెలవులకి వాళ్ళ మామయ్య గారి ఇంటికి వెడుతున్నాడని దివాణంలోని సేవక జనం చెప్పుకున్నారు!

ప్రెసిడెంటుగారి ఏడపోతుని ఆ వేళ ప్రొద్దున్న అంకాలమ్మకి బలి ఇచ్చారు. ఆ ప్రసాదం కొడుక్కి పెట్టాలని గుమ్మంలో కొయ్యబొమ్మయి కూర్చుంది సీతమ్మ.కామేశంగారి ప్రాంగణంలో ప్రెసిడెంటు గారి బక్క మేకకు పుట్టిన పిల్ల మేకను చిత్రవధ చేస్తున్నారని మాత్రం ఆ తల్లిమేక కింకా తెలియలేదు!

* * *

రెండు నెలల తరవాత ఒక రోజున హెడ్మాస్టారింటికి ఏదో పని మీద వెళ్ళింది గౌరి. ఆమెను చూస్తూనే వాళ్ళబ్బాయి — "గౌరీ! మీ విస్సుగాడి ఫోటో పత్రికలో పడింది, చూశావా?" అన్నాడు.

ఇన్ని రోజులుగా పోయిన ప్రాణం ఒక్కసారిగా లేచి వచ్చింది. గజగజ వణికే చేతులలో పేప రందుకుంది గౌరి.

విశ్వం ఫోటోయే! అచ్చులో తమ్ముడి ఫోటో చూస్తూ మురిసిపోయింది.

'పిచ్చి అక్కా!' అని తమ్ముడు పిలుస్తున్నట్లే ఉంది.

"నీ ఫోటో అచ్చయింది,తమ్ముడూ!" అని ఏదేదో అనటం మొదలుపెట్టింది.

హెడ్మాస్టరబ్బాయి పకపక నవ్వాడు. "విస్సూ ఇక్కడ లేడు, గౌరీ! అది వాడి ఫోటో!"

పిల్లవాణ్ణి మందలించి లోపలికి పంపేశారు హెడ్మాస్టారు. గౌరి తన వైపు ఆశగా చూస్తోంది. అపరాధిలా తల తిప్పేసుకున్నారు.

"మాస్టారుగారూ! ఈ ఫోటో కింద ఏటి రాసుంది, బాబూ?" ఆసక్తిగా, ఆత్రతగా అడిగింది గౌరి.

ఆయన గొంతు పిడచకట్టుకు పోయింది. మాట రాక 'అమ్మగారు పిలుస్తున్నా' రని సంజ్ఞ చేస్తూ ఆమెను లోపలికి పంపేశారు.

మళ్ళీ ఆయన దృష్టి ఆ ఫోటో క్రింద అక్షరాలపై నిలిచాయి. ఈ మాటు ఆ అక్షరాలు రక్తాన్ని చిమురుస్తున్నాయి!

"ఈ సంవత్సరం రాష్ట్రం మొత్తం మీద ఎస్. ఎస్. సి. పరీక్షలో ప్రథముడుగా వచ్చిన విద్యార్థి — విశ్వం. వయస్సు 14 సంవత్సరాలు. అఖిల భారత మెరిట్ స్కాలర్‌షిప్‌కి అర్హుడయి భవిష్యత్తులో ఎంతో ముందుకి పోవలసిన ఈ విద్యార్థి చిన్న తగాదాపై పెద్ద నేరం చేసి తన జీవితాన్ని చేజేతులా పాడుచేసుకున్నాడు. రెండు నెలల క్రితం గవరయ్య అనే వ్యక్తి తల పగలకొట్టి చంపిన కారణంగా సెషన్సు కోర్టులో విచారించబడి ప్రస్తుతం బోర్‌స్టల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు." ★